

# లిటిల్ రాస్కెల్

మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఛ తను** ఆలోచనలోకి వెళ్ళిపోయింది.

"నువ్వు తినవా?" అడిగింది రాజేష్‌ని.

"చూళ్ళేదా? తినేశాను."

రాజేష్ రెండో జేబులోంచి మరో రెండు బాదం పళ్ళు తీసి నీరజవైపు చేతిని చూపాడు.

"నో! థాంక్స్" చెప్పింది నీరజ.

రాజేష్ లేచి సీటుకింద వున్న కార్టన్ బయటికి తీసి, అందులోని టింకూకి అందించాడు ఓ బాదం పండు. అది కార్టన్ మీదికి ఎక్కి, ముందు రెండు కాళ్ళతో దాన్ని పట్టుకుని గబగబా కొరికి తినసాగింది.

"నీకో మంచి స్నేహితుడు" చెప్పింది నీరజ టింకూని చూసి.

"వీడికి కూడా మాటలు వచ్చి వుంటేనా?" నవ్వాడు.

"విజయవాడ రాకమునుపు నువ్వూ, అమ్మ ఎక్కడుండేవారు?" అడిగింది.

"గుంటూరులో"

"ఎక్కడ?"

"ఏ.టి అగ్రహారంలో"

"మీ నాన్నగారు మీతో వుండేవారా?"

"ఊహూ"

"ఏ స్కూల్లో చదివేవాడివి?"

"ఇంట్లోనే అమ్మ చెప్పేది. నేను కె.జి చదవకుండానే, ఫస్ట్ స్టాండర్డ్‌లో చేరాను" కొద్దిపాటి గర్వం కనపడింది రాజేష్ మాటల్లో.

"గుడ్"

"మా ఇంట్లో ఎన్నో చెట్లు వున్నాయి. నా పుట్టినరోజు వచ్చినా, అమ్మ పుట్టిన రోజు వచ్చినా, నాన్నగారి పుట్టిన రోజు వచ్చిన, అమ్మా నాన్నల పెళ్ళిరోజు వచ్చినా ఆ ఇంట్లో నా చేత అమ్మ బోళ్ళన్ని మొక్కలు పాతించేది. మేము గుంటూరునుంచి వచ్చేదాకా రోజూ నీళ్ళు పోస్తుండేవాళ్ళం. అమం చెప్పేది ఆ మంచిరోజుల్లో పావుగంట ఖర్చుచేసి మేము పాతిన ఆ చెట్లు మేము చచ్చిపోయిన తర్వాత కూడా ఆ రోజుల గుర్తుగా వుంటాయని. సపోటా, మామిడి, కొబ్బరి, నిమ్మ... ఇంకా ఎన్నో పాతాను."

"ఏమో? మేం ఆ ఇంట్లో వదిలి వచ్చేనాటికి అవి ఇంకా కాయలు కాయలేదు. ఈపాటికి కాస్తుండాలి."

"మీ అమ్మా నాన్నల పెళ్ళిరోజు?"

"నాకెలా తెలుస్తుంది? మొక్కలు పాతించి అమ్మ చెప్పేది ఆ మొక్క ఎందుకు నాటామో?"

"ఆ ఇంటికి తీసుకెళ్తావా?"

"ఊహూ! దారి గుర్తులేదు. మనింట్లో చోటు లేకపోతే ఇంకొక ఇంట్లో ఇది మనిల్లు కాదుగా అనుకోకుండా అందరికీ పనికివచ్చే మొక్కలు నాటాలి అనేది అమ్మ. అలా ప్రతివాళ్ళూ మొక్కలు పెంచితే, అందరికీ ఎన్ని మంచి రోజులుంటే ఈ లోకం అంత పచ్చగా వుంటుందంట. హనుమాన్ పేట ఇంట్లో నేను మల్లె అంటు పాతాను. మొన్ననే మొదటిసారిగా మొగ్గలు వచ్చాయి. సన్నజాజులు కూడా."

"నాకెంతో దిగులుగా వుంది బెంగగా వుంది" చెప్పాడు కాసేపాగి.

"దేనికి దిగులు? మేమంతా..."

తల అడ్డంగా వూపి చెప్పాడు రాజేష్ "మీరెవరూ అమ్మకాదుగా. ఇలా నాకు దిగులుగా విచారంగా బెంగగా వుండకపోతే ఆ సంగతి అమ్మకి తెలిస్తే అమ్మకి బాధగా వుంటుంది కదండి. నాకు తెలుసు అమ్మకి కూడా యిప్పుడు నాకున్నట్లే వుంటుంది."

"ఏం?"

"అలా లేకపోతే మాకు ఒకరిమీద మరొకరికి ప్రేమ లేనట్లే మరి" రాజేష్ ఎంతో అమాయకంగా, నెమ్మదిగా చెప్పాడు. నీరజ గొంతులో ఏదో అడ్డుపడినట్లయింది. అకస్మాత్తుగా రాజేష్‌ని దగ్గరకి తీసుకుని తన హృదయానికి హత్తుకోవాలని, ఆ పసివాడిని ఓదార్చాలని అనిపించింది. కానీ తమాయించుకుంది.

"యూ ఆర్ ఏ గ్రేట్ లిటిల్ బాయ్" చెప్పింది. రాజేష్ తలవంచుకుని కూర్చున్నాడు కాసేపు, మెల్లిగా చెప్పసాగాడు.

నాకు అమ్మంటే ప్రాణం
అమ్మకోసం అన్నీ చేస్తాను
హోమ్ వర్క్ చేస్తాను
ఉల్లిపాయ తొక్కు తీస్తాను నాకు అమ్మంటే ప్రాణం
డాక్టర్‌కి నాలిక చూపిస్తాను
బాదం చెట్లు ఎక్కాలనుకున్నా ఎక్కను
ఎక్కితే అమ్మకి కోపం కాబట్టి
నాకు మా అమ్మంటే ప్రాణం
అమ్మకోసం పచ్చి టమోటానే తింటాను
అమ్మకోసం అన్నీ చేస్తాను
నాకు అమ్మంటే ప్రాణం
టమోటా అంటే నాకు అయిష్టం.
నేను అగ్గిపుల్ల గీస్తే అమ్మకి అయిష్టం.
అందుకే అగ్గిపుల్ల ముట్టను
లేనిది కావాలని మారాం చెయ్యను.

నర్సరీ రైమ్స్‌లా ఓ ప్రత్యేక బాణీతో యెంతో మృదువుగా చదివాడు రాజేష్ ఆ గేయాన్ని. తల ఎత్తి నీరజవంక చూశాడు. రాజేష్ కళ్ళల్లో నీళ్ళు. రాజేష్ ఏడుస్తున్నాడని అతని ఉచ్చారణలో ఎక్కడా బయటపడలేదు.

"నీకు టమోటాలిష్టంలేదా?" అడిగింది నీరజ రాజేష్ కన్నీళ్ళని గమనించనట్లే.

తల వూపాడు. తర్వాత తల పక్కకి తిప్పుకుని చేతిరుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు.

"అగ్గిపుల్లలు గీయటమంటే యిష్టమా?"

"అవును. ఒకసారి వేలు కాల్చుకున్నాను. ఆ రాత్రి అమ్మ ఆ గేయం నేర్పించింది. వారానికొకసారయినా యిది అమ్మకి వినిపిస్తాను. యింకా ఇలాంటివెన్నో బోలెడు వచ్చు."

"మీ అమ్మ కథలు రాస్తుందా?"

"ఊహూ.. విచారాన్ని కన్నీళ్ళద్వారా బయటకి పంపకూడదని చెప్తుంది అమ్మ. ఇలా గేయం ద్వారా తగ్గించుకోవాలట."

"మీ అమ్మని ఒక్కసారి చూడాలని వుంది" చెప్పింది నీరజ మనఃస్ఫూర్తిగా.

"హనుమాన్ పేటలో వుండే సభాపతి అనే ఆయనకి హైదరాబాద్‌నించి టెలిగ్రాం ఏదైనా వచ్చిందా?" అడిగాడొక వ్యక్తి.

విజయవాడలోని బకింగ్ హోమ్ పేట టెలిగ్రాఫ్ ఆఫీసులో బయటనుంచి వచ్చే టెలిగ్రాంలు డెలవరీ చేసే సెక్షన్‌లోని అతను, ఆ వ్యక్తికేసి ఎగాదిగా చూసి చెప్పాడు.

"రాలేదు. మీరెవరు? "

"అడిగానంతే"

గిరుక్కున వెనక్కి తిరిగి ఆ వ్యక్తి బయటకి నడిచాడు.

11

నీరజ ఇంటికి చేరేసరికి సాయంత్రం నాలుగూ ముప్పావవుతోంది. ఆటో దిగుతున్న నీరజని, రాజేష్‌ని చూసి బన్ని కాంపౌండ్ గోడదూకి ఇంటి గుమ్మం దగ్గరకి వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కుతూ అరిచింది."రాజేష్ వచ్చాడు."

దశరథరామయ్య నీరజతోపాటు రాజేష్ కూడా వుండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"హలో తాతయ్యా" విష్ చేశాడు రాజేష్ మెరిసే కళ్ళతో. తనని చూడటంతో రాజేష్‌కి సంతోషంగా వుందని గుర్తించాడు ఆయన.

"హలో రాజేష్! వెల్‌కమ్" చెప్పాడు చుట్ట ఆర్పేసి.

నీరజ లోపలికి వెళ్ళిపోయింది.

"తాతయ్యా అమ్మ కనిపించలేదు" చెప్పాడు రాజేష్ దిగులుగా.

"కనపడుతుందిలే దిగులుపడకు."

బన్ని అడిగింది రాజేష్‌ని - "రాజేష్ నీమీద నీళ్ళు కుమ్మరిస్తే నీకు మూర్ఛరోగం వుందని మా అమ్మతో చెప్పావు. నిజమా, అబద్ధమా?"

"అబద్ధం"

"మూర్ఛరోగం వున్న వాళ్ళ మీద నీళ్ళు పొయ్యాలా?"

"అవును."

"మరి ఆ రోగం లేకపోతే నీకెలా తెలుసు?"

"మా వూళ్ళో ఎండాకాలంలో బిచ్చగాళ్ళు రోడ్లమీద మూర్ఛపడి పోతుంటారు. అప్పుడు సందులో వాళ్ళు బక్కెట్లతో నీళ్ళు తెచ్చిపోస్తారు."

"రాజేష్ తల్లి కనపడలేదా?" అడిగాడు దశరథరామయ్య కోడలిని ఆమె కాఫీ కలిపి తీసుకురాగానే.

తల అడ్డంగా వూపి జరిగింది చెప్పింది నీరజ.

"అలా ఎలా మాయమయింది?" అడిగాడాయన ఆశ్చర్యంగా.

"అదే మిస్టరీగా వుంది. నిస్సందేహంగా మీ అబ్బాయే రాజేష్ తండ్రి" చెప్పింది నీరజ.

గొంతు పెగుల్చుకుని అడిగాడాయన. "అంత ఖచ్చితంగా ఎలా తెలుసు?"

స్కూల్లో రాజేష్ తండ్రి పేరు కె.సాంబశివరావుగా నమోదు అయింది" తలవంచుకుని చెప్పింది.

"ఈ విషయాలేం నాకు వాడు ఎప్పుడూ చెప్పలేదు. చెపితే మీ పెళ్ళి జరిగేది కాదు."

"ఆ భయంతోనే ఆయన చెప్పి ఉండరని నా పూర్తి విశ్వాసం. అసలు ఆయనకీ సావిత్రికీ, ఎక్కడ, ఎందుకు తగాదా వచ్చిందో? సావిత్రి పేచీపెట్టే మనిషిలా అనిపించలేదు నాకు."

"అంతా అగమ్యగోచరంగా వుంది నాకయితే."

"ఇవాళ శనివారం కదా! మీ అబ్బాయికి సగంరోజు. ఇంకా ఇంటికి రాలేదే?" అడిగింది నీరజ.

"ఎక్కడ తిరుగుతున్నాడో?" చెప్పాడు దశరథరామయ్య.

లలితానగర్ కాలనీలో దశరథరామయ్య వుండే యింటి సందు చివర కొత్తగా ఓ వీడియో పార్లర్ తెరిచారు. దానిపేరు 'డీలక్స్ వీడియో పార్లర్.'

సాంబశివరావు బేంక్‌నుంచి ఇంటికి వస్తుంటే దాని బయట వున్న బోర్డుమీద 'నాట్ నౌ డార్లింగ్' అనే ఇంగ్లీషు సినిమా ఆరుంపావుకి మొదలవుతున్న సంగతి చదివాడు.

వెంటనే స్కూటర్ షాపు బయట లాక్ చేసి అయిదు రూపాయలు పెట్టి టిక్కెట్టు కొనుక్కుని లోపలికి వెళ్ళాడు. హిందీ సినిమా 'సంగం'లో పాటలు వేస్తున్నారు. వీడియోలో ఆ సినిమా చూసి బయటపడేసరికి ఎనిమిది ఇరవై అయిదయింది.

వీడియో ప్రొప్రయిటర్‌ని అడిగాడు సాంబశివరావు. "ఏం సినిమా అండి ఇది? రెండుమూడు చోట్ల న్యూడ్ సీన్లుండాలి. కట్ అయ్యాయే?"

"ఏమో మాకు తెలియదు" బదులు చెప్పాడు ఆయన.

12

"తాతయ్యా నా బొమ్మలు చూస్తావా?" అడిగాడు రాజేష్.

"ఏవీ చూపించు"

"మరి నువ్వు చుట్ట పారేస్తేనే."

"ఇప్పుడేగా వెలిగించింది?"

"నాకదేం తెలియదు. చుట్ట పారేయ్."

దశరథరామయ్య నోట్లోంచి చుట్టని తనే తీసేసి, వీధిలోకి తీసుకొచ్చి విసిరేసి వచ్చాడు. తన పెట్టె తెరచి డ్రాయింగ్ పుస్తకం తీసుకొచ్చి ఆయన ఒడిలో పెట్టి అన్నాడు రాజేష్.

"చూడు"

పేజీ పేజీ తిరగేస్తూంటే చెప్పసాగాడు.

"ఇది నేను వేసిన మొదటి బొమ్మ, ఏనుగు."

"ఏనుగంటే నీకిష్టమా?"

"అవును. అమం ఏనుగు కథ చెప్పింది. తర్వాత ఇది గీశాను."

"ఏం కథ?"

"పేజీ తిప్పు. ఆ కథ కూడా రాశాను. చెప్తా విను. సింహం.. లేళ్ళని, ఆవులని, జిరాఫీలని ఇలా అన్నిటినీ తినేస్తోంది. అవన్నీ వెళ్ళి" పేజీ తిప్పి చెప్పాడు. ఏనుగు దగ్గర మొరపెటుకున్నాయి. ఏనుగూ ఏనుగూ సింహం మమ్మల్ని తినేస్తోంది. దాన్నుంచి మమ్మల్ని రక్షించవా అని."

అందుకు ఏనుగు 'అలాగే' అన్నది."

పేజీ తిప్పాడు రాజేష్.

"చూశావా తాతయ్యా! మర్నాడు ఏనుగు, సింహం నది దగ్గర ఎదురుపడ్డాయి. సింహం నీళ్ళకొస్తుందని తెలిసి ఏనుగు అక్కడికి వెళ్ళిందన్నమాట. ఏనుగు సింహంతో 'సింహమా ఇకనుంచి జంతువులను తింటే వూరుకోను' అని మందలించింది. అందుకు సింహం 'పోవే ఏనుగూ ఆకు, అలం తిని బతికేదానివి. పచ్చిమాంసం తిని రక్తం తాగే నా బలం ముందు నీవు ఆగలేవు పారిపో' అన్నది.

ఏనుగు వెంటనే "పేజీ తిప్పి చూపించి వూపిరి పీల్చుకుని చెప్పాడు. "ఇలా తొండంతో సింహాన్ని గట్టిగా చుట్టి నీట్లోకి విసిరేసింది. సింహం భయంతో పారిపోయింది. అప్పటినుంచి ఏనుగు, సింహం ఎదురుపడకుండా జాగ్రత్తపడుతున్నాయి."

రాజేష్ భుజం మీద తట్టి చెప్పాడు దశరథరామయ్య.

"నువ్వు బొమ్మలు బాగా గీస్తావు పెద్దవాడివయితే మంచి ఆర్టిస్టువవుతావు. రంగులు కూడా సరిగ్గా పెయింట్ చేశావు."

"థాంక్స్ తాతయ్యా! మళ్ళీ రేపో కథ చూపిస్తాను" డ్రాయింగ్ బుక్ మూసేశాడు రాజేష్.

తాటాకు పెట్టెలోంచి చుట్ట తీశాడు దశరథరామయ్య.

"ఇప్పుడే తాగావ్‌గా. వద్దు తాతయ్యా!"

"తాగనీరా నీ అసాధ్యం కూలా"

"నీ తెల్లటి మీసం చూడు ఎలా కాలి మచ్చలు పడుతోందో" దశరథరామయ్య మెడచుట్టూ చేతులు వేసి భుజం మీదకి ఎక్కి చెప్పాడు రాజేష్.

వీపుకి చల్లగా తగలడంతో దశరథరామయ్య మృదువుగా రాజేష్‌ని విడిపించుకుని చెప్పాడు.

"ఛీ!ఛీ!ఛీ మళ్ళీ లాగూలోనేనా?"

వంటపని పూర్తిచేసి చెంగుతో చేతులు తుడుచుకుంటూ నీరజ ఆ మాటలు విన్నది.

"అమ్మాయ్ ఇది వీక్‌నెస్‌లా వుంది. రేపొకసారి వాడి డాక్టర్‌కి చూపిస్తే మంచిదేమో?"

మౌనంగా తలూపింది నీరజ. ఆమె దర్శరథరామయ్యకి ఆమె చూపులో "మీకు మీ మనవడంటే అంత ప్రేమా?" అన్న భావన కనిపించింది.

"హలో, ఎప్పుడూ రాక?" బయటినించి ఇంట్లోకి వచ్చిన సాంబశివరావు అడిగాడు భార్యని నవ్వుతూ.

"ఇందాకే" చెప్పింది నీరజ.

నీరజ వంటగదిలోకి వెళ్ళిపోయింది పలకరింపుగానయినా చూడకుండా..

"ఏమైంది నాన్నగారూ? వాడ్ని వాళ్ళమ్మకి అప్పగించి వచ్చిందా? నిజం తెలిసిందా?"

దశరథరామయ్య కొడుకువంక తీక్షణంగా చూడటం తప్ప మాట్లాడలేదు. బాత్‌రూంలోంచి వచ్చిన రాజేష్‌ని చూసి ఉలిక్కిపడ్డాడు సాంబశివరావు.

"హలో నాన్నగారు" నవ్వుతూ విష్ చేశాడు రాజేష్.

సాంబశివరావు జవాబుగా తలాడించాడు అంతే. నీరజ వంటింట్లోంచి కాఫీ కప్పుతో వచ్చి దాన్ని భర్తకు అందించింది. ఆమె ప్రశ్నార్థకంగా చూసాడు సాంబశివరావు.

"మీకు ఎప్పుడు ఆకలివేస్తే చెప్పండి. అప్పుడు వడ్డిస్తాను" నిరాసక్తిగా చెప్పింది.

కాఫీ కప్పు పక్కన పెట్టి చెప్పాడు.

"ఆకలిగా వుంది. ఇది తాగితే ఆకలి చచ్చిపోతుంది"

వంగి మౌనంగా కాఫీ కప్పుని అందుకుని నీరజ మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది.

ఎప్పటిలా అంతా కలిసి కూర్చున్నారు. ఎప్పటిలాగే రాజేష్ ప్రతిముద్దకి 'ఇది అమ్మ ముద్ద, ఇది నాన్నగారి ముద్ద, ఇది తాతయ్య ముద్ద, ఇది పిన్ని ముద్ద, ఇది శ్రీరాముడు ముద్ద' అంటూ తిన్నాడు.

"ఈ పాడలవాటు మానరాదూ" కసురుకున్నాడు సాంబశివరావు.

"మనం అన్నం తినేప్పుడైనా అందరినీ తలుచుకోవాలని అమ్మే ఈ అలవాటు నేర్పింది నాన్నగారూ. మీరు పాడు అలవాటంటే మానేస్తాను" చెప్పాడు రాజేష్ బిక్కమొహం వేసుకుని.

"మనుషుల్ని మర్చిపోవడం పాడలవాటు. నీది మంచలవాటే" నీరజ చెప్పింది."

"నిజమే. అమ్మ నాకెప్పుడూ పాడలవాట్లు నేర్పించదు" చెప్పాడు రాజేష్.

భాష మీద చక్కటి కమాండ్ వున్నవారు, నా వుద్దేశంలో తమ నోటిని అదుపులో పెట్టడం నేర్చుకున్నవారు" చెప్పాడు సాంబశివరావు కఠినంగా.

"ఇందాక రాజేష్ తను గీసిన బొమ్మలు చూపించాడు. చాలాబావున్నాయి" వెంటనే సంభాషణ మార్చాడు దశరథరామయ్య.

"అందులో నీకే బొమ్మ బాగా నచ్చింది తాతయ్యా?" అడిగాడు రాజేష్.

"ఏనుగు."

"నాక్కూడా" చెప్పాడు.

"ఓసారి అడవిలో ఓ ఏనుగు కోతిని చూసి చెప్పిందట. 'చూడు నేను ఎంత బలంగా, ఎత్తుగా వున్నానో. నీవు పొట్టిగా, అసహ్యంగా వున్నానని. దానికి కోతి జవాబు చెప్పిందట." ఆగి తన భర్తవంక చూస్తూ పూర్తిచేసింది నీరజ. 'మరేం ఫర్వాలేదు. త్వరలోనే నేను మనిషినవుతాను, నువ్వు మాత్రం ఇంకా ఏనుగులాగానే వుంటావు అని' నాకూ అన్నటికన్నా అందుకే ఏనుగు అంటేనే ఇష్టం."

ఆ తరువాత ఎవరూ మాట్లాడలేదు. రాజేష్ చాలా తక్కువ తినడం ఒక్క నీరజే గమనించింది.

భోజనాలయ్యాక దశరథరామయ్య విశ్రాంతిగా చుట్టని వెతకబోయాడు.

"వద్దు తాతయ్యా" రాజేష్ తన చిన్న చేతులతో ఆయన చేతిని పట్టుకుని వారించాడు.

"అబ్బా తాగనీరా" విసుక్కున్నాడాయన.

"హూ."

"కావాలంటే నువ్వూ తాగు."

"ఛీ!"

"నే తాగితే నీకేం?"

"కేన్సర్ వస్తుంది."

"మీ అమ్మకి ఇలాంటివి చెప్పటం తప్ప ఇంకేం పనిలేదా?"

"మా అమ్మ కాదు, మా టీచర్ చెప్పింది."

"చేతులు వదులు, ఇది నాకలవాటు."

"వినకపోతే గట్టిగా ఏడుస్తాను" బెదిరించాడు రాజేష్.

దశరథరామయ్య చుట్ట వెలిగించగానే నిజంగానే గట్టిగా ఏడవసాగాడు.

దశరథరామయ్య చటుక్కున ఆర్పేశాడు చుట్టని.

"ఏమిట్రా బాబూ నువ్వు నా ప్రాణానికి" విసుక్కున్నాడు.

రాజేష్ ఏడుపు ఆపి నవ్వాడు. తన రెండు చేతులు ఆయనమీద వుంచి భుజాల మీద వేసి గట్టిగా కౌగలించుకుని చెప్పాడు.

"నీకు చుట్టలు తాగాలనిపించినప్పుడల్లా చెప్పు తాతయ్యా కౌగలించుకుంటాను. సరేనా?"

దశరథరామయ్య చేతి వ్రేళ్ళు అప్రయత్నంగా రాజేష్ వీపు నిమిరాయి.

అలాంటి ఆప్యాయత చవిచూసి ఎన్నాళ్ళయిందో ఆయనకి. అందుకే మనసు స్పందించి, కళ్ళు చెమర్చాయి.

"అలాగే చుట్టకన్నా ఇదే బావుంది" చెప్పాడు తన్మయత్వంతో.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in